పాలవలసలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ పరిధిలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీని స్థానిక టీడీపీ నాయకులు చేపట్టారు. అందులో భాగంగా పంచాయతీ పరిధిలో స్థానిక టిడిపి నాయకులు మద్ది శేఖర్ ఆధ్వర్యంలో కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాలవలస అప్పలనారాయణ, శ్రీనివాస్, పి.నారాయణరావు, కోరాడ రమేష్, సూరి, రాములు, చందక ఎల్లారావు, రౌతు అప్పల రాము, అప్పలరాజు, సత్తిబాబు, జట్లమ్మ, డిజిటల్ అసిస్టెంట్ మౌనిక, కోరాడ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించే నగరం విశాఖి

డబల్ డెక్కర్‌బస్సులో ప్రయాణించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సులను విశాఖ బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను సీఎం చంద్రబాబునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి బస్సులో ప్రయా ణించారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకూ బీచ్ రోడ్‌లో ప్రయాణించనున్న పర్యాటక బస్సులు మొత్తం 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో తిరగనున్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయాణం చేశారు. 24 గంటల పాటు ప్రయాణించేలా టికెట్ ఛార్జీని రూ.500 పెట్టారు. అయితే పర్యాటకుల సౌలభ్యం కోసం సగం మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందన్నారు. రూ.250 రూపాయలకే 24 గంటల పాటు టికెట్టును వర్తింప చేసేలా ఆదేశాలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. పర్యాటకులంతా పర్యావరణ హితంగా వ్యవహరించాలని, మన తీరప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షిం చేలా ఈ బీచ్‌లు నిర్వహించేందుకు పౌరులు సహకరి ంచాలన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నా లజీ హబ్‌గా ఎదగబోతోందన్నారు. విశాఖలో డేటా సెంటర్, సీ కేబుల్ వేస్తారని, ఈ కేబుల్ ద్వారా విశాఖతో మిగతా ప్రపంచం అనుసంధానం అవుతుందన్నారు. సీఎంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు బస్సులో ప్రయాణించారు.

భవిష్యత్‌లో ఏఐ ఇండిస్ట్రియల్ రివల్యూషన్

మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఏఐ ద్వారా మనం ఎదుర్కొంటున్న ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని, ఏఐ టెక్నాలజీ వినియోగించి ఎలాంటి మార్పు తీసుకురావచ్చో మనం ఒక్కసారి ఆలోచించాలని రాష్ట్ర విద్య సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. చంద్రంపాలెం స్కూల్‌లో శుక్రవారం ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో అందరూ ఒక లక్ష్యం పెట్టుకోవాలని, అందుకోసం అహర్నిశలు కష్టపడాలన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారు కాబట్టే మనం ముందుకు వెళు తున్నామన్నారు. విద్యా వ్యవస్థలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామన్నారు. మెరుగైన విద్యావ్యవస్థను రూపొందించుకుందామన్నారు. తల్లిదండ్రులు గర్వపడే విధంగా విద్యార్థులు రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల మధ్య సెల్ఫీలు దిగారు. ఏఐ, స్టెమ్, రోబోటిక్స్ టూల్స్ తో విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. ఏఐ రోబోటిక్స్, స్టెమ్ రోబో, టింకర్ ఆర్బిట్స్, బేసిక్ బ్రెడ్ బోర్డ్ కిట్, ఏఐ ఎక్స్‌ప్లోరర్ కిట్‌లను పరిశీలించారు. వీటితో పాటు ప్రాజెక్ట్ కిట్, మెకాట్రాన్ కార్, స్మార్ట్ ఫార్మింగ్, రోబోటిక్ ఆర్మ్, డిజిటల్ డైస్ ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు అరుణశ్రీ, భాగ్యలక్ష్మిలు రూపొందించిన స్మార్ట్ ఫార్మింగ్ ప్రాజెక్టును పరిశీలించి సదరు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ లిమిటెడ్ ఫౌండర్ ఛైర్మన్, బోర్డు మెంబర్ బీవీఆర్ మోహన్ రెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, వేపాడ చిరంజీవిరావు, ఇతర ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, సయింట్ ఫౌండేషన్ కో ఫౌండర్ నామ్, ఆర్జేడి విజయ భాస్కరరావు, డిఈఓ ప్రేమ్ కుమార్, మాజీ శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, ఎంఈఓ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు..

ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం

మంత్రి రాంప్రసాద్

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డు పరిధిలో ఉన్న సింహాచలం బస్ స్టేషన్‌లో సి.సి కెమేరాలు, వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర రవాణా యువజన, క్రీడా శాఖా మంత్రి మండిరపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన స్త్రీ శక్తి దిగ్విజయంగా అమలు జరుగుతోం దన్నారు. రాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్ర మంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (విజయనగరం జోన్) కే.బ్రహ్మానంద రెడ్డి, డి.పి.టి.ఓ (యు.ఎస్.ఏ) బి. అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ ఎస్.శరత్ బాబు, అసిస్టెంట్ మేనేజర్ గురుమూర్తి, సుధారాణి, పాల్గొన్నారు.

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు

- మంత్రి కందుల దుర్గేష్
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం విశాఖలోని చిల్డ్రన్స్ ఎరినాలో రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు 162వ జయంతి సందర్భంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. వాడుక భాషకు వన్నెతెచ్చిన గిడుగు రామమూర్తి పంతులు ప్రాతఃస్మరణీయులని కొనియాడారు. పుస్తకాలు, అక్షరాల కంటే మానవత్వం గొప్పదని చెప్పిన వ్యక్తి గిడుగు అని అన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కూటమి కాపాడుతుందని పేర్కొన్నారు. ఆధునిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత ముందుకు వెళ్లినప్పటికీ తెలుగు జాతి ఔన్నత్యాన్ని, భాష గొప్పతనాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు.

14 మందికి పురస్కారాలు:

ఈ సందర్భంగా తెలుగు భాషా పురస్కార కమిటీ ఎంపిక చేసిన "గిడుగు వెంకట రామమూర్తి పంతులు పురస్కారం" గ్రహీతలను మంత్రి దుర్గేష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రహీతకు రూ. 25,000 నగదు పురస్కారం, జ్ఞాపికను మంత్రి దుర్గేష్ తన చేతుల మీదుగా అందించారు. పురస్కారం పొందిన 14 మంది అవార్డు గ్రహీతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులుపై రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి రేగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన 'తెలుగు వెలుగు' పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కమిటీ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, సృజనాత్మకత, జానపద కళల అకాడమీ ఛైర్మన్ గంగులయ్య, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి, కమిటీ కన్వీనర్ ఆర్.మల్లికార్జునరావు, గిడుగు రామమూర్తి పంతులు మనవడు నాగేశ్వరరావు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒంటిపై పెట్రోల్ వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.చిన్నారావు (42) నిత్యం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. తన మాటకు ఎవరు ఎదురు చెప్పినా సహించేవాడు కాదు. దీంతో కుటుంబ సభ్యులు భార్య అతనితో పెద్దగా మాట్లాడేవారు కాదు. ఈ నేపథ్యంలో ఒంటిపై పెట్రోల్ వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు మంటలను ఆర్పివేసి 108లో కేజీహెచ్‌కి తరలించారు. 80 శాతం కాలిపోయి, ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - తగరపువలస: ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. తగరపువలస సీపీఐ కార్యాలయం జంక్షన్లో విద్యుత్ పోరాట యోధుల 25వ వర్ధంతి సందర్భంగా మృతవీరులకు నివాళు లర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. స్మార్ట్ మీటర్లు విద్యుత్ ట్రూ అప్ చార్జీలు గతంలో విద్యుత్తు వాడిన అదనపు చార్జీలపై నిరసన చేపట్టారు. కార్యక్రమంలో భీమిలి ఏరియా సీపీఐ కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, రామ్ పైడి, తౌడు బాబు, సీనియర్ నాయకులు చిల్ల నరసింహులు, నూలు ఆదినారాయణ, మాఊరు తౌడు బాబు, వీర్రాజు, లక్ష్మణరావు, ముత్యాలరావు, అప్పారావు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ కళ్యాణమండపం పునరుద్ధరణకు చర్యలు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం మహాత్మా గాంధీ కల్యాణ మండపం గురించి భీమిలి జోనల్ కమిషనర్‌కి వినియోగదారుల సంఘం తరుపున ఇచ్చిన వినతికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. 40 లక్షలతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారని వినియోగ దారుల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.నాయుడు, పి.రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. భీమిలి వాసులకు ఎంతో అవసరమైన ఈ కళ్యాణ మండపం వినియో గంలోకి వస్తే వివాహాలు ఇతర శుభ కార్యాలు చేయడానికి ఉపయోగ పడుతుదని అన్నారు. జీవీఎంసీ అధికారులు సచివాలయ అధికారులు దీనిని వినియోగంలోకి తీసుకుని రావడానికి వీలుగా శుక్రవారం పరిశీలన చేశారని వర్మ తెలిపారు.

రాజీవ్ గృహకల్ప మండల పరిషత్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత

విశాలాంధ్ర - మధురవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మధురవాడ చంద్రంపాలెం హైస్కూల్ పర్యటనలో భాగంగా స్థానిక ఐదవ వార్డు కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ మొల్లి హేమలత రాజీవ్ గృహకల్ప మండల ప్రాథమిక పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, అదే ఆవరణలో ఉన్నత పాఠశాలను కూడా ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరారు. వార్డు పరిధిలో రాజీవ్ గృహకల్ప, మాలిక వలస, బోరవాని పాలెం, శారదనగర్, జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్‌పిపి 1 కాలనీ తదితర ప్రాంతాల విద్యార్థులు హైస్కూల్‌కు వెళ్లాలంటే సుమారు 5 కిలోమీటర్లు జాతీయ రహదారిని దాటుకుంటూ వెళ్లవలసి వస్తుందని, జాతీయ రహదారిని దాటే క్రమంలో చాలామంది ప్రమాదం బారిన పడుతున్నారని, కావున అత్యధిక జనాభా కలిగిన ప్రాంతం కనుక రాజీవ్ గృహకల్ప ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే ఉన్నత పాఠశాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. తరగతి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు.

గర్భిణీలకు అండగా సావిత్రి ప్రసూతి పథకం

గీతం ఆసుపత్రి సిఎమ్‌ఇలో ప్రశంసలు

విశాలాంధ్ర - మధురవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్య సంరక్షణకు అమలు చేస్తున్న వివిధ పథకాలను, వివిధ చట్టాలను వైద్యులు విధిగా అనుసరించాలని ముఖ్యంగా ప్రసూతి సమయంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కలిగించాలని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) జిమ్‌సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి పిలుపునిచ్చారు. జిమ్‌సర్ గైనికాలజి విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, చట్టాలు -2025 అనే అంశంపై వైద్యులకు నిరంతర వైద్య విద్యా బోధన (సిఎమ్‌ఇ) కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. జననీ శిశు సురక్ష కార్యక్రమం, జననీ సురక్ష యోజన ప్రధాన మంత్రి మాతృ వందన యోజన వంటి పథకాలు మహిళలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి కృషిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహక ఛైర్‌పర్సన్, గైనకాలజి విభాగం అధిపతి డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ గర్భిణీలకు అండగా గీతం ఆసుపత్రి గత 10 సంవత్సరాల నుంచి సావిత్రి ప్రసూతి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 2908 మంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోగా వారిలో 1344 మంది గర్భిణీలకు ప్రసవం పూర్తి అయ్యేంత వరకు అన్ని సేవలను సురక్షితంగా, ఉచితంగా అందించామని తెలిపారు. కార్యక్రమంలో జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్.వి.రావు, డాక్టర్ పి.గీతాకుమారి, డాక్టర్ కె.కార్తిక్ బోగవల్లి, పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

గురజాడ విగ్రహం వద్ద ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యు, ఏఐవైఎఫ్ నిరసన

విశాలాంధ్ర - విశాఖ: మద్యం, డ్రగ్స్, సోషల్ మీడియాలో అశ్లీలత కారణంగా మహిళలపై నిత్యం దాడులు జరుగుతున్నాయని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, బేగం అన్నారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వద్ద డిమాండ్లపై నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రజాప్రతినిధులు మహిళలపై అత్యాచారాలు చేస్తున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు అత్యాచారాలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి ఆమోదం తెలపడం దుర్మార్గమన్నారు. ఇటీవల కాలంలో ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకొంటున్నారని విమర్శించారు. ప్రజలను ఐక్యం చేసి పోరాటాలకు సమాయత్తం అవుతామని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాంబాబు, కె.అచ్యుత్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి హామీని టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయకుండా కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు దేవుడమ్మ, గాయత్రి, పుష్పలత, పద్మ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు విధానంతో ప్రజలకు రేషన్ సకాలంలో అందుతుందని అన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పల రాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, బొడ్డు సత్యారావు, నాగు, తిరుపతిరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి మధుర గ్రామాల రేషన్ కష్టాలు తీర్చండి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రెడ్డిపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో మధుర గ్రామాలు భద్రయ్యపేట, సుంకర పేట, నమ్మి వారి కల్లాలులో నివసిస్తున్న గ్రామస్తుల రేషన్ కష్టాలు తీర్చాలని మాజీ మండల బిజెపి అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు స్థానిక తహశీల్దార్ కాకర ఆనందరావుకు వినతి అందజేశారు. రెడ్డిపల్లి రేషన్ డిపో నుంచి ఈ మూడు గ్రామాలు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ మూడు గ్రామాల్లో నివసిస్తున్న గ్రామస్తులు కూలీలే కావడం వల్ల పగలంతా బయట గ్రామాలకు పట్టణాలకు వెళ్లి కూలి పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడు రేషన్ తెచ్చుకోవడానికి రాత్రి సమయం అయిపోతోందని అన్నారు. కొన్ని సందర్భాల్లో రేషన్ సర్వర్ సరిగా అవ్వడం లేదని అన్నారు. ఈ మూడు గ్రామాలలో సుమారు 250 రేషన్ కార్డులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరి అవస్థల ను దృష్టిలో పెట్టుకొని వీరికి అందుబాటులో డిపోను ఏర్పాటు చేయాలని కోరారు.

కొనసాగుతున్న డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్టీల్ ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం స్కూల్‌లో డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ రెండవరోజు కెజిబి సెక్రటరీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ.మధుసూదన్, ఆర్జెడి విజయ భాస్కర్, డీఈవో ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. డీఎస్సీలో 1416 మంది సెలెక్ట్ అవ్వగా శుక్రవారం 815 మందికి గాను 756 అవ్వగా మిగిలిన 660 మంది అభ్యర్థులకు సర్టి ఫికెట్లు పరిశీలించారు. ఈ సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కొంత మంది అభ్యర్థులకు తెలియకపోవటంతో రాలేకపోయిన వారికి తెలియజేసి వారి కోసమై ఎదురు చూడాల్సి వచ్చింది.

రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా వాయుమార్గం ద్వారా శుక్రవారం ఉదయం నగరానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి స్థానిక నేతలు మరియు అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం 11-45 గంటలకు హెలికాప్టర్ ద్వారా బీచ్ రోడ్డులో గల కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిపాడ్ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగలపూడి అనిత, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ గణబాబు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ బాబు, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విఎమ్ఆర్డిఏ కమిషనర్ కె. విశ్వనాథన్, ఏపీ ఈపీడీసీఎల్ సిఎండి ఇమ్మడి పృద్వి తేజ్, విశాఖ ఆర్డీవో పి. శ్రీలేఖ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి హోటల్ నోవాటెల్‌కు బయలుదేరి వెళ్లారు.

తెలుగు భాష దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - తగరపువలస: తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనం తెలియజేసే గీతాలతో విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఆసక్తిని కలిగించే బోధనోపకరణాల ప్రదర్శన చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేయడం జరిగింది. తెలుగు తల్లి, గిడుగు వెంకట రామ్మూర్తి, వాగ్గేయకారుడు త్యాగయ్య, ఆదికవి నన్నయ, శ్రీకృష్ణదేవరాయలు, సరస్వతి దేవి మొదలగు వారి వేషధారణతో విద్యార్థులు అలరించారు. ఉపాధ్యాయులు గిడుగు వెంకట రామమూర్తి గొప్పతనాన్ని కొనియాడారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు బాలరాజు రెడ్డి, సూర్యం మాస్టారులు చక్కగా నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం విశ్వశాంతి, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.1328/2021

Between:
Sri. Duvvi Yerrayya Reddy
.....Plaintiff

And:
1.Smt. Gudivada Navaratnam (Died), w/o late Babu Rao.
2.Sri.Gudivada John Joseph, s/o late Babu Rao, aged 58 years, Residing at D.No.9-17-26, Opp: Amulya Enclave, CBM compound Visakhapatnam 530003.
3.Smt. Adwin, aged 48 years, w/o late Gudivada Vijay Ratnam Kumar (2nd son of Defendant) s/o late Gudivada Babu Rao, aged 48 years, Residing at c/o Joseph (adwin brother) D.No.9 15-1, Flat No 16, Prinice Apartments-13, Opp: Shoppers stop lane, CBM compound, Visakhapatnam - 530003.
4.Sn. Gudivada Nickoles, s/o G.Babu rao, aged 52 years, Residing at D.No 9-41-21, Pithapuram colony, Andhra bank Lane, Visakhapatnam-530003.
5.Smt. Jyothi Baid, w/o Baid Charitra Kumar, D/o late G.Babu Rao, aged 49 years, Residing at D.No.53-13-2, Resapuvani palem, Opp: Swarna bharathi Indoor Stadium, Visakhapatnam -530013.
.....Defendant's

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై వ్యాజ్యంలో సదరు ప్రతివాదులు తేదీ: 12/9/2025న ఉదయం 10.30 గంటలకు సదరు కోర్టులో స్వయంగా గాని, ఏజెంట్ ద్వారా గాని వకీల్ ద్వారా గానిహాజరు కావాల్సిందిగా కోరుతు న్నాము. లేని యెడల సదరు దావా మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.

జి.శివప్రసాద్, అడ్వకేట్
విశాఖపట్నం
ఫోన్ 8688884963

హైవేపై ఆర్టీసీ బస్సు దగ్ధం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. కూర్మన్నపాలెం నుంచి విజయనగరం వెళ్తున్న బస్సు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేసి ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపేశాడు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇంజిన్ నుంచి మంటలు రావడంతోనే ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.

విద్యార్థులే మన భవిష్యత్, ఆస్తి, సంపద..

మంత్రి నారా లోకేష్
సైయెంట్ ఫౌండేషన్ సహకారంతో విశాఖ జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విద్యార్థులే మన భవిష్యత్, మన ఆస్తి, సంపద అని.. భవిష్యత్‌లో వచ్చే ఏఐ ఇండస్ట్రియల్ రివల్యూషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖ రాడిసన్ బ్లూ రిసార్ట్ లో ప్రముఖ ఐటీ సంస్థ సైయెంట్ ఫౌండేషన్ సహకారంతో రూ.8 కోట్లు వెచ్చించి విశాఖ జిల్లా వ్యాప్తంగా 50 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ల్యాబ్స్, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్స్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రోబో సాయంతో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ 1991లో సైయెంట్ అనే కంపెనీకి ఆనాడు ఇన్ఫోటెక్ అని పేరుండదని, బీవీ మోహన్ రెడ్డిని అందరూ ఇన్ఫోటెక్ మోహన్ రెడ్డి అని పిలిచేవారన్నారు. 1991లో ఇప్పుడున్న సైయెంట్ కంపెనీని స్థాపించి ఈ రోజు 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న వ్యక్తి మోహన్ రెడ్డి అని కేవలం మన దేశంలోనే కాకుండా 22 దేశాల్లో సైయెంట్ కంపెనీని నడిపిస్తున్నారన్నారు. ఆయన కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.8కోట్లు వెచ్చించి 50 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ను ఏర్పాటుచేసిన వ్యక్తి మోహన్ రెడ్డి అని లోకేష్ కొనియాడారు. ఏఐ వల్ల మనకేంటి ఉపయోగం అని అందరూ అనుకోవచ్చునని ఇక్కడున్న విద్యార్థులే మన భవిష్యత్ అని, గతంలో పారిశ్రామిక విప్లవం వల్ల అనేక మందికి ఉద్యోగాలు వచ్చాయనీ, ఐటీ వల్ల దేశం, ప్రపంచంలో తెలుగువారికి మెరుగైన అవకాశాలు వచ్చాయన్నారు. సైయెంట్ లిమిటెడ్ ఫౌండర్ ఛైర్మన్, బోర్డు మెంబర్ బీవీఆర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏఐ వినియోగం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే నేర్పిస్తే భవిష్యత్‌లో బాగా రాణిస్తారని, అందుకే ఏఐ ల్యాబ్స్‌ను పాఠశాలల్లో ఏర్పాటుచేస్తున్నామన్నారు. అంతకుముందు విశాఖ చంద్రపాలెం జడ్పీ హైస్కూల్ లో సైయెంట్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన ఏఐ, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్స్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో

సైయెంట్ లిమిటెడ్ ఫౌండర్ ఛైర్మన్, బోర్డు మెంబర్ బీవీఆర్ మోహన్ రెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, వేపాడ చిరంజీవిరావు, ఇతర ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం కోస్టల్ బ్యాటరీ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తో కలిసి పుష్పాలను అందించి ఘన స్వాగతం పలికారు.

పండుగ సీజన్ కోసం అమెజాన్ ఫ్రెష్ లోకల్ డిలైట్స్ స్టోర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఓనమ్, వినాయక చవితి మొదలుకుని నవరాత్రులు, దీపావళి వంటి ఉత్తేజకరమైన పండుగలతో కూడిన సీజన్ ను దృష్టిలో ఉంచుకొని సాంప్రదాయబద్ధమైన రుచులను ఆస్వాదించేందుకు, అలనాటి వంటకాలను మళ్ళీ అందిపుచ్చుకునేందుకు, కుటుంబంతో, మిత్రులతో కలిసి స్థానికంగా అందరూ మెచ్చే వంటకాలను అందించేలా అమెజాన్ ఫ్రెష్ లోకల్ డిలైట్ స్టోర్ ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు అమెజాన్ ఫ్రెష్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ చెప్పారు. ఆంధ్రా ఊరగాయలు కావచ్చు, మురుక్కు కావచ్చు, పంజాబీ లస్సీలో లేదా తాజాగా కాచిన కాఫీ తదితర అన్ని అమెజాన్ ఫ్రెష్ లోకల్ డిలైట్స్ స్టోర్ తీసుకువస్తోందన్నారు. ఇంటి వంటల అసలైన రుచుల కమ్మదనాన్ని భారతదేశపు అమోఘమైన వంటకాల వారసత్వాన్ని వేడుకగా జరుపుకునేందుకు కూర్చిన లోకల్ డిలైట్స్ స్టోర్, పండుగల్లో తప్పకుండా కలిగి ఉండాల్సినవాటిని, స్థానిక ప్రత్యేకతలను, దైనందిన స్టేపుల్సును ఆఫర్ చేస్తోందన్నారు. ఇవన్నీ, 170కి పైగా పట్టణాల్లో 2 గంటల్లోపు గుమ్మం వద్దకు గొప్ప ధరలకే డెలివర్ అవుతాయన్నారు. అమెజాన్ పేతో కస్టమర్లు అదనపు సేవింగ్స్ కూడా పొంది ఆనందించవచ్చు అని, కాగా ప్రైమ్ మెంబర్లు డెలివరీని ఇంకా వేగంగా పొందవచ్చు అన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- జిల్లా వైసీపీ అధ్యక్షులు కె.కె రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగర వైసిపి కార్యాలయంలో శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. సమావేశంలో కె.కె రాజు బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వార్డు స్థాయి కమిటీ నిర్మాణం పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజలు తరుపున పోరాటం చేసినపుడే నిజమైన నాయకుడిగా ప్రజలు గుర్తిస్తారన్నారు. ఎన్నికల ముందు టీడీపీ, బిజెపి, జనసేన ఒక కూటమిగా ఏర్పడి అనేక మోసపూరిత హామీలు ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను

మోసగిస్తున్న తీరును ఎండగడుతూ వార్డు స్థాయి లో ప్రతి ఇంటికి వెళ్ళి " బాబు షూరిటీ..మోసం గ్యారంటీ " కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రజల పక్షాన వైసీపీ పోరాటం చేసింది కాబట్టే తల్లికి వందనం లాంటి పథకాలు అరకొరగా అయిన ఇచ్చారని అన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, వావిలపల్లి ప్రసాద్, బర్కత్ అలీ, కె.వి.యన్ శశికళ, సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి లోకేష్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖ నగరానికి వచ్చిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఉదయం విశాఖలోని జిల్లా టిడిపి పార్టీ కార్యాలయంలో 68వ ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ వారి వినతులను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు. ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలోని వాడబలిజ మత్స్యకారులమైన తాము అరకొర సంపాదనతో అనేక కష్టాలు ఎదుర్కొంటున్నామని, తమకు బోట్లు, వలలు అందించడంతో పాటు మా ప్రాంతాల్లో పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఉత్తరాంధ్ర వాడబలిజ మత్స్యకార సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ఉద్యోగం కల్పించడంతో పాటు నివాస స్థలం మంజూరు చేయాలని విశాఖ మింది ప్రాంతానికి చెందిన దాడి అవినాష్, గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రాష్ట్ర పోలీసు నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక నవరాత్రుల ఉత్సవాలలో ఊరేగింపు కార్యక్రమంలో సౌండ్ సిస్టమ్స్‌ను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర ఈవెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు.

మొబైల్ సిటీ టెక్నాలజీస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన శామ్‌సంగ్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తన అనుబంధ సంస్థ శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కో లిమిటెడ్ ద్వారా, న్యూరోలాజికా సహకారంతో, భారతదేశంలో తదుపరి తరం మొబైల్ సిటీ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కో. లిమిటెడ్, ఆధునిక మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలలో ప్రపంచ నాయకుడిగా, డయాగ్నొస్టిక్ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీని మార్చడానికి ప్రత్యేకంగా రూపొందించిన ఈ తదుపరి తరం వ్యవస్థలను అందిస్తుంది. ఇవి మొబిలిటీ, ఏఐ సహాయక సామర్థ్యం, మరియు రోగి-మొదటి రూపకల్పనను మిళితం చేస్తూ, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు ఎప్పుడైనా, ఎక్కడైనా నాణ్యమైన సేవను అందించడానికి సాధికారత కల్పిస్తాయి. కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి శ్రేణిలో సరేటామ్, ఎలైట్, ఓమ్ని టామ్, ఎలైట్ పి సి డి, బాడీ టామ్ 32/64 ఉన్నాయన్నారు. ఇవన్నీ ఆసుపత్రులు, ప్రత్యేక కేంద్రాల వివిధ క్లినికల్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 6 వినతులు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కి సంబంధించి 06 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమావేశం మందిరం లో నందు సివి లు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 06 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 03, 3వ జోన్

కు 01, 8వ జోన్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌తో టాటా డిజిటల్ రుణాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)ని అర్థవంతమైన విధంగా, సత్వరం వినియోగించడం ద్వారా భారతదేశవ్యాప్తంగా అందరికీ రుణ లభ్యతను అందుబాటులోకి తేవడంలో ముందు వరుసలో ఉన్న సంస్థల్లో టాటా డిజిటల్ కూడా ఒకటిగా నిలుస్తోంది. ఓఎన్‌డీసీలో ఆర్థిక సేవలకు సంబంధించి తొలి, దిగ్గజ బయర్ ప్లాట్‌ఫాంలలో ఒకటిగా నిలుస్తున్న టాటా డిజిటల్ ఇప్పటికే గత 3 నెలల వ్యవధిలో ఒక మిలియన్ పైగా వ్యక్తిగత రుణ దరఖాస్తులకు తోడ్పాటు అందించింది. తద్వారా ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లో దరఖాస్తులు, యూజర్లు, రుణ వితరణల్లో గణనీయమైన వాటా దక్కించుకుంది. డిజిటల్ సర్వీసులకు ఓపెన్, ఇంటరాపరబుల్, సమ్మిళిత వ్యవస్థను రూపొందించాలన్న ఓఎన్‌డీసీ విజన్‌కి అనుగుణంగా టాటా డిజిటల్ యొక్క భారీ స్థాయి, సంస్థపై వినియోగదారులకు గల నమ్మకం, విస్తృతి మొదలైనవి ఉండటమనేది తొలినాళ్లలోనే భారీ స్థాయిలో ఫలితాలు సాధించేందుకు తోడ్పడింది. టాటా న్యూ హెూస్ట్ చేసే టాటా డిజిటల్ యొక్క భారీ లోన్ మార్కెట్‌ప్లేస్‌లో ప్రస్తుతం 14 రుణదాత భాగస్వామ్య సంస్థలు ఉన్నాయి. వీటిలో రెండు రెండు ఓఎన్‌డీసీ నెట్‌వర్క్ ద్వారా అనుసంధానమైనవిగా ఉన్నాయి. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్ సామర్థ్యాలను వినియోగించుకుంటూ రుణాలను పొందే అనుభూతిని డిజిటల్‌గా, నిరాటంకంగా మార్చడమే కాకుండా దేశీయంగా అంతగా సర్వీసులు అందని వర్గాలకు కూడా సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం" అని టాటా డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గౌరవ్ హజ్రతి తెలిపారు.

చింతకిందికి ప్రతిష్టాత్మక తెలుగు భాషా పురస్కారం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సుప్రసిద్ధ కథ, నవలా రచయిత, నాటకకర్త, సినీ రచయిత డాక్టర్ "చింతకింది శ్రీనివాసరావు" ప్రతిష్టాత్మక గిడుగు రామమూర్తి తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం వుడా చిల్డ్రన్స్ థియేటర్ లో రాష్ట్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన ఈ అవార్డును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా స్వీకరించారు. చింతకింది శ్రీనివాసరావు కళింగాంధ్ర తెలుగు మాండలికాన్ని తన కథలు, నవలల ద్వారా ఖండాంతరాలకు వ్యాప్తి చేశారు. ఆయన రచనలు సరళమైన భాషలో సాగుతూ ఉత్తరాంధ్ర అక్షర సౌరభాలను వెదజల్లుతుంటాయి. దాలప్పతీర్థం, కప్పస్తంభం, కాన్పులదిబ్బ తదితర కథా సంపుటాలు ఆయన రచనా వైదుష్యానికి మచ్చుతునకలు. నంది పురస్కారం, ప్రభుత్వ ఉగాది పురస్కారం, చాసో, రావిశాస్త్రి పురస్కారాలు సహా ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పుడీ గిడుగు తెలుగు భాషా పురస్కారం ఆయన అక్షర వ్యవసాయానికి దక్కిన మరో గౌరవంగా భావించవచ్చు. ఆయనకు ఈ గౌరవం దక్కడం పట్ల తెలుగు సాహితీరంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన తెలుగు భాష కు చేసిన సేవలను కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా ప్రస్తుతం సరళమైన తెలుగు భాష విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు స్కూల్ ప్రిన్సిపాల్ వి.రమాదేవి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు శంకర్, పద్మావతి, సిబ్బంది శిరీష, సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆనందపురం: బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శు

క్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.లక్ష్మి మాట్లాడుతూ "తెలుగు కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాకుండా, యుగయుగాలుగా కవుల ఊహలకు రెక్కలు కట్టి పండితుల జ్ఞానానికి వెలుగునిచ్చిన అమృత భాష అన్నారు. గిడుగు వెంకటరామమూర్తి తెలుగు సాహిత్యాన్ని సులభతరం చేసి, సామాన్యునికి చేరువ చేశారని, అయినప్పటికీ ఈ భాష ఈనాటికీ నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. పాఠశాలల్లో తెలుగు మాధ్యమం, తెలుగు పోస్టులు తగ్గించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: మాతృభాషను పరిరక్షించుకుందాం అని తెలుగుదండు అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి అన్నారు. శుక్రవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని మద్దిలపాలెం కూడలిలో ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు భాషాభిమానులు, కళాకారులు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నీరాజనాలు అర్పించారు. అనంతరం తెలుగు దండు సూరి మాట్లాడుతూ ఉర్దూను సైతం అధికార భాషగా గౌరవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు భాషకు కానికాలం దాపురించడం విచారకరమన్నారు. తమిళనాడు, కర్ణాటక మొదలుకుని ప్రపంచమంతా గౌరవిస్తున్న తెలుగును, ఆ తల్లి బిడ్డలు దూరం చేసుకోవడం క్షమార్హం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళు తెరిచి తెలుగు భాష పరిరక్షణ కోసం నడుం బిగించాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సూరి పేర్కొన్నారు. భాషా పరిరక్షణను బాధ్యగా భావించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, తమ బాధ్యతను విస్మరించిన నేపథ్యంలో త్వరలోనే తెలుగు భాషాభిమానులతో కలిసి, గాంధేయ మార్గంలో నిరసనలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పురస్కారాలు పొందుతున్న వారు కూడా ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేయాలని సూచించారు.

విలువైన ఋషికొండ ప్యాలేస్ నిరుపయోగం

ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పవన్ కళ్యాణ్‌కి వైజాగ్ వచ్చినప్పుడే ఋషికొండ ప్యాలేస్ గుర్తొస్తుందని, వందల కోట్లతో నిర్మించిన రుషికొండ ప్యాలెస్ నిరువయోగంగా ఉండిపోయిందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఋషికొండ ప్యాలేస్ మీద గగ్గోలు పెట్టారు, కాని అధికారంలోకి వచ్చాక నిరూపయోగంగా ఉంచారన్నారు. విశాఖ వచ్చినప్పుడే పవన్ కళ్యాణ్ కి ఋషికొండ ప్యాలేస్ గుర్తు వస్తుందని ప్రియాంక దండి అన్నారు. చంద్రబాబు దర్శనికుడని పవన్ కళ్యాణ్ పొగుడుతారు, ఈ భవనాన్ని ఎలా ఉపయోగించాలో ఆయనకి బాగా తెలుసంటాడు, అంటే మీకు ఏది తెలియదని ఒప్పుకుంటున్నారా? మీ పార్టీ నుండే కందుల దుర్గేష్ పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నారు, అంతా చంద్రబాబు చెప్పినట్టే చేస్తే మీకు ఇంక మంత్రి పదవులు ఎందుకని ఆమె ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ మాటలు వింటుంటే జనసైనికులు సిగ్గు పడుతున్నారని, ఇది జనసేననా లేక చంద్రబాబు భజన సేననా అని వాళ్ళు మాట్లాడుకుంటున్నారని ప్రియాంక అన్నారు. ఋషికొండ ప్యాలేస్ ని హైదరాబాద్ లో తాజ్ ఫలక్ నామలా ఉపయోగించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని లేదా ఇంటర్నేషనల్ హెూటల్స్ కి లీజ్ కి ఇవ్వచ్చని,జగన్ మీద, వైసీపీ మీద విమర్శలు ఆపి ముందు ప్యాలేస్ వినియోగంలోకి తీసుకురావాలని ప్రియాంక సూచన చేసారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని, ఆ భవంతి నిరూపయోగంగా ఉంచి పాడైతే జగన్ నాసిరకం నిర్మాణం చేసాడని జగన్ మీద, వైసీపీ మీద నిందలు వేసే రాజకీయ కుట్ర చేస్తున్నారా అని ప్రియాంక ప్రశ్నించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విద్యా విభాగం అధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. భారత



జాతి గర్వించదగ్గ హాకీ దిగ్గజ క్రీడాకారుడు, హాకీ మాంత్రికుడు, పద్మభూషన్, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ మాట్లాడుతూ నేటి క్రీడా లోకానికి మేజర్ ధ్యాన్ చంద్ జీవితం ఒక మార్గదర్శకమన్నారు. అనంతరం కళాశాలలో చదువుతూ క్రీడలలో రాణిస్తున్న పలువురు క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విష్ణు మూర్తి, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ప్రసాదరావు, సీనియర్ అధ్యాపకులు సహదేవుడు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఆనందపురం: నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారత దేశం గర్వించదగ్గ మేటి క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ (హాకీ) జన్మదినాన్ని పురస్కరించుకుని క్రికెట్ , వాలీబాల్ , కబడ్డీ, కోకో , త్రోబాల్ , బాస్కెట్ బాల్, టెన్నికోయట్ నిర్వహించారు. ఈవెంట్లలో 83 టీమ్స్ పాల్గొన్నాయి. సుమారుగా 996 పైగా విద్యార్థులు ఉత్సాహముగా క్రీడలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డా.ఎన్. ప్రసాదరాజు, డా. ఎస్. శంభు ప్రసాద్ ప్రిన్సిపాల్, డా.పి.ఎస్.ఎన్. రాజు, సి.ఎం.ఓ, వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీలు)ఇతర ఆధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో మొదలైన ఈ కార్యక్రమంలో ధ్యాన్ చంద్ క్రీడలకు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. వివిధ పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజీ 3
శనివారం 30, ఆగస్టు 2025

ప్రభుత్వపరంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

క్రీడల కోసం ప్రపంచస్థాయి మౌలిక వసతులను కల్పిస్తాం

జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎనర్జీ, టాలెంట్, డిటర్మినేషన్ మన ఆంధ్ర రాష్ట్ర యువకుల బ్లడ్ లోనే ఉందని, ప్రభుత్వ పరంగా క్రీడాకారులను పోత్సహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భారత హాకీ లెజెండ్, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మేజర్ ధ్యాన్ చంద్, తెలుగు భాషా వికాసానికి కృషిచేసిన గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ కేబినెట్ మీటింగ్ లో స్పోర్ట్స్ గురించి చాలా చర్చించాం. గౌరవ ఉప ముఖ్యమంత్రి పవనన్న కూడా స్పోర్ట్స్‌ను ప్రమోట్ చేయాలని, గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేయాలన్నారు.

ఇప్పుడున్న పిల్లలు యూట్యూబ్, పబ్జీలకు అలవాటుపడ్డారు. వీటికి ఫుల్ స్టాప్ పెట్టాలంటే గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేస్తేనే సమాజంలో మార్పు వస్తుందని మేమందరం చర్చించామని, నమ్మామని, చంద్రబాబు నేతృత్వంలో ఒక గ్రాస్ రూట్ మూమెంటమ్ క్రియేట్ చేశారని, ఇది ప్రారంభం మాత్రమేనన్నారు. 24వేల మంది యువకులు దాదాపు పది క్రీడల్లో పాల్గొని.. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సుమారు 462 మంది విన్నర్స్ మనముందు ఉన్నారన్నారు.

ప్రభుత్వపరంగా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. దేశానికే కాదు.. ప్రపంచానికే ఏపీని క్రీడా రాజధానిగా మార్చాలనేది మా లక్ష్యం అన్నారు. క్రీడల కోసం ప్రపంచస్థాయి మౌలిక వసతులను కల్పిస్తామని, మిమ్మల్నందిరినీ ప్రమోట్ చేస్తాం. ఇది కేవలం మెడల్స్ కోసం మాత్రమే కాదని, ప్రజల ఆరోగ్యం కోసం కూడానని, మంగళగిరిలో 45 పార్క్ లను నిర్మిస్తున్నాం. దీనివల్ల సోషల్ ఇంటిగ్రేషన్ కూడా ఏర్పడుతుందన్నారు. మనలో పట్టుదల, కసి ఉండాలని, అప్పుడే సాధించగలగుతామన్నారు. జీవితంలో సక్సెస్ అంత సులభంగా రాదని, అనేక కష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. విద్యాశాఖ నుంచి ఎలాంటి మద్దతు కావాలన్నా ఇస్తామని, క్రీడల్లో బాగా రాణించాలన్నారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖ క్రీడాకారులు పి.గోపీచంద్, ఎంఎస్ కే ప్రసాద్, కోనేరు హంపీని మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. వివిధ క్రీడల్లో రాణించిన సాకేత్ సాయి మైనేని, యర్రాజి జ్యోతి, ఈ.రజిని, డి.జ్యోతికశ్రీ, షేక్ జెఫ్రిన్, పి.శివారెడ్డి, శ్రీమతి సత్యగీతతో పాటు పలువురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ శ్రీభరత్, మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరీషా, ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద విద్యుత్ భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి

- విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశాల మేరకు ప్రజలకు, భక్తులకు, మండప నిర్వాహకులకు విద్యుత్ భద్రతా సూచనలు అందజేస్తున్నామని ఎస్ఈ చెప్పారు. విద్యుత్ శాఖ పేర్కొన్న సూచనలను పాటించి గణేష్ ఉత్సవాలను సురక్షితంగా, ఆనందకరంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలని, అనధికారిక కనెక్షన్లు లేదా విద్యుత్ దొంగతనం ప్రమాదకరం చట్టవిరుద్ధం అన్నారు. విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రిషియన్లు లేదా నిపుణుల ద్వారా మాత్రమే చేయించాలన్నారు. డిబి బోర్డు పెట్టి, అందులో తప్పనిసరిగా అమర్చాలని, వాటర్‌ప్రూఫ్ ఉండాలన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలని, తెగిన వైర్లు, సడలిన జాయింట్లు వాడరాదన్నారు. ప్రతి మండపానికి ప్రత్యేక ఎర్తింగ్ ఉండాలని, విద్యుత్ పరికరాలకు సరైన ఎర్తింగ్ ఉండేలా చూడాలన్నారు. విగ్రహాల తరలింపు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యసర సమయంలో ఏపీ ఈపీడీసీఎల్ హెల్ప్ లైన్ నంబర్ 1912కి సంప్రదించాలన్నారు.

చిన్న శ్రీను ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో సిరమ్మ

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి ఫుడ్ బాల్ గ్రౌండ్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) పుట్టిన రోజు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తన కుమార్తె అయిన చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ఈనెల 29 నుండి సెప్టెంబర్ 4 వరకు జరుగు చిన్న శ్రీను ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌ను తాను స్వయంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు మొదటి స్థానం బహుమతి 50000/-, రెండవ స్థానం 30000/-, మూడవ స్థానం బహుమతి 15000/- ప్రదానం చేస్తామని చెప్పారు. అదేవిధంగా క్రీడా కారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయన్నారు. జీవితంలో ఉన్నత స్థాయి చేరడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలు వల్ల దేహధారుద్యంతో పాటు మానసిక ఉల్లాసానికి కూడా ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాసురాజు , ఎంపీపీ కంటుభుక్త రాంబాబు జడ్పీటీసీ కోరాడ వెంకట్రావు, ఎంపీపీ మజ్జి వెంకట్రావు వివిధ మండల పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు , బంక సత్యం ,గాడు శ్రీనివాస్ ,కార్పొరేటర్లు అక్కరమాని పద్మావతి రామానాయుడు , దౌలపిల్లి కొండబాబు ,వార్డు ఇంచార్జ్ శిల్ల కరుణాకర్ రెడ్డి , వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు , రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి ,జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ , ఎంపీటీసీలు పొట్నూర్ చంద్రశేఖర్ , సిర సూరప్పుడు ,చెల్లూరు నగేష్ , సర్పంచులు సమ్మిడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ , సీనియర్ నాయకులు పిన్నింటి ఎర్రయ్య రెడ్డి,గుండాస్ మదనాయుడు, కొంద్రు రామసరప్పుడు, రాంబుక్త ప్రభాకర్ నాయుడు మహిళలు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నగరంలో పలు ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలపై చర్యలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీ, సౌత్ జైల్ రోడ్డు,సెంట్రల్ పార్క్ ప్రాంతాలలో రాత్రివేళ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శు క్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, సౌత్ జైల్ రోడ్డు ,సెంట్రల్ పార్క్ ప్రాంతాలలోని రోడ్లపై బహిరంగంగా అసాంఘిక కార్యక్రమాలు రాత్రి పూట జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని అందుకు జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా గురువారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో అకస్మికగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా వ్యభిచారము, గంజాయి , ఆల్కహాల్ మొదలైనవి జరుగుతున్నాయని ఈ తనిఖీలలో బహిర్గతం అయిందన్నారు. ఈ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక స్త్రీ కేజీహెచ్ వద్ద ఉన్న ఒక లాడ్జి కు పురుషులతో వెళ్తుండగా వారిని వెంటాడి అదుపులోకి పోలీసులు తీసుకున్నారని తెలిపారు . నగరంలో పలుచోట్ల ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరంతరం పోలీసు ,రెవెన్యూ , జీవీఎంసీ విభాగాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి అటువంటి కార్యక్రమాల్ని అదుపులోకి తీసుకురావడం జరుగునని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 4 వ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 7గురికి పర్యవేక్షకులుగా పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో సీనియర్ అసిస్టెంట్ లుగా విధులు నిర్వహిస్తున్న 7 గురు సిబ్బందికి జీవీఎంసీ పర్యవేక్షకులుగా పదోన్నతి పత్రాలను అందించడం జరిగిందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో పర్యవేక్షులుగా పదోన్నతి పొందిన 7గురు సిబ్బందికి పదోన్నతి పత్రాలను జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు తో కలిసి అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరు ఎంతో బాధ్యతతో విధులు నిర్వహించి జీవీఎంసీకి మంచి సేవలను , పేరు ప్రఖ్యాతులు తేవాలని, మీరు పని చేసేది ప్రజలతో మేమేకమయ్యే ఉద్యోగం అయినందున ఒక ఉద్యోగిగా కాకుండా సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని పదోన్నతి పొందిన కె. శ్రీనివాస్, కె.గణేష్, టి. సత్యవేణి, పి. అప్పలనాయుడు, డి. రామతల్లి, బి. సన్యాసిరావు, ఎన్. సంతోష్ కుమార్ లకు మేయర్ సూచించి వారిని అభినందించారు.